క్లుప్తంగా

రైతులు నీరు తగ్గకుండా చూడాలి



జగ్గయ్యపేట: వాతావరణంలో ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వరి సాగు చేసిన రైతులు ఈ దశలో 2 లేదా 3 సెంటీమీటర్ల నీరు తగ్గకుండా చూసుకోవాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కృష్ణంరాజు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైరులో ఎదుగుదల లోపించి గిడసబారినట్లు కనిపిస్తే ముందు చర్యగా లీటరు నీటికి 2 గ్రాముల చిలామిన్ జింక్ పిచికారీ చేసుకోవాలన్నారు. నీరు సమృద్ధిగా లేకపోతే లీటరు నీటికి 13.045 పొటాషియం నైట్రేట్ అనే పోషకాన్ని 5 గ్రాములు పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న దేవదాయ శాఖ ఏసీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారిని మంగళవారం జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే శాంతి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, విజయవాడ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఏఈఓ తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ ఆర్డీఓ బదిలీ



నూతన ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: నందిగామ ఆర్డీఓ పీ సాయిబాబు బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా సాయిబాబు రాజమండ్రికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్డీఓగా ఏ రవీంద్రరావు రానున్నారు. రవీంద్రరావు ప్రస్తుతం గుంటూరు జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ ఫ్యాషన్ షో మిస్ టీన్ సుహాన



పాయకాపురం (విజయవాడ రూరల్): రవీంద్రభారతి హైస్కూల్ (వాంబేకాలనీ) అజిత్‌సింగ్‌నగర్ రవీంద్రభారతి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న షేక్ సుహాన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షోలో మిస్ టీన్‌గా గెలుపొందినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హైదరాబాదులో ఈ నెల 24వ తేదీన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షో జరిగింది. ఈ షోలో టీన్ విభాగంలో జరిగిన పోటీలో మొత్తం 61 మంది పాల్గొనగా షేక్ సుహన మిస్ టీన్‌గా ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో సుహన మాట్లాడుతూ ఈ గెలుపునకు కారణం తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు హైస్కూల్ యాజమాన్యం అని తెలియజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం, హెచ్ఓడీలు, జీఎం, జోనల్ ఇన్‌చార్జి సుహానను అభినందించారు.

దర్శకుడు, నిర్మాత రమాశంకర్ మృతి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: నిర్మాత, దర్శకుడు, సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు ఒమ్మి రమాశంకర్ మృతి కళారంగానికి తీరనిలోటు అని కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధి కె.డేవిడ్‌రాజు అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం రమాశంకర్ సంతాప సభ నిర్వహించారు. సభలో డేవిడ్ రాజు మాట్లాడుతూ బీఎస్‌పీ నాయకునిగా ఆయన పేదల కోసం ఎంతో కృషి చేశారని, ఎందరో గాయనీ గాయకులను పరిచయం చేశారన్నారు. చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ రమాశంకర్ దివ్యాంగులకు ఉచితంగా సైకిళ్లు అందించారన్నారు. సమావేశంలో మాంతి రమణ, బి.వీరభద్రరావు, మారేపల్లి జోషి, శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత రమాశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం

- వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



పాదయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జయంతి(వీరులపాడు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా కార్యదర్శి ఇప్పల కృష్ణారెడ్డి మండలంలోని జయంతి గ్రామం నుంచి పరిటాల ఆంజనేయస్వామివారి ఆలయం వరకు సుమారు 25 కి.మీ మేర చేపట్టిన పాదయాత్రను మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పాదయాత్రగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

అభివృద్ధి పథంలో నందిగామ..

అభివృద్ధిలో రాష్ట్రంలోని మొదటి 10 స్థానాల్లో నియోజకవర్గాన్ని నిలిపిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుకే దక్కిందని అరుణకుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా నందిగామను నవ నందిగామగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ప్రతీ ఒక్క సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని అమలు చేయడమే కాకుండా ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజల ఆశీస్సులు, దేవుడి దయతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా సాగిన పాదయాత్ర..

ఇప్పల కృష్ణారెడ్డి చేపట్టిన పాదయాత్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో ఉత్సాహంగా సాగింది. మహిళలు కోలాటమాడుతూ పాదయాత్రలో సందడి చేయగా, యువత కేరింతల నడుమ కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని ఆంజనేయస్వామివారి ఆలయానికి పాదయాత్ర చేరుకుంది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావులు విజయం సాధించాలని కోరుతూ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా నిలిచి విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, చల్లా బ్రహ్మేశ్వరరావు, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయంతి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

శివరాత్రి ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహించాలి

ముక్త్యాల(జగ్గయ్యపేట): భవానీముక్తేశ్వర దేవాలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను అధికారులందరూ కలిసి సమర్థవంతంగా నిర్వహించాలని నందిగామ ఆర్డీఓ పీ సాయిబాబు సూచించారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8వ తేదీన జరిగే శివరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలన్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి పటిష్టంగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జయప్రకాష్, జగ్గయ్యపేట సీఐ జానకీరామ్, ఎస్సై సతీష్, పంచాయతీ ఈఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిబాబు, పక్కన ఏసీపీ రవికిరణ్, ఈఓ జయప్రకాష్ తదితరులు

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

వైద్యాధికారి డాక్టర్ నాగరాణి

జగ్గయ్యపేట అర్బన్: వచ్చే నెల మూడవ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ప్రభుత్వాస్పత్రిలోని పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని పీపీ యూనిట్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పట్టణంలో ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియోను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పట్టణంలో మొత్తం 2,197 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇందుకుగానూ 23 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్‌లో ఒక బూత్, స్థానిక ఆసుపత్రిలో ఒక బూత్, మొబైల్ టీమ్ ద్వారా బూత్‌లకు వెళ్లని వారిని గుర్తించి పోలియో చుక్కలు వేస్తామని పేర్కొన్నారు. సదస్సులో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, వైద్యులు వాసంతి, అనూష, షైల, హెల్త్ విజిటర్ జానకి, మెడికల్ ఆఫీసర్లు, రూట్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాణి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నందిగామ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆర్డీఓ పీ సాయిబాబు అన్నారు. డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు, ప్రత్యేక ర్యాలీని నిర్వహించారు. ముందుగా ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు తప్పనిసరిగా బాల్య వివాహాలకు సంబంధించిన అంశాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటోందని, ఈ క్రమంలోనే అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, నందిగామ, జగ్గయ్యపేట ప్రాజెక్ట్ పరిధిలోని సీడీపీఓలు భాగ్యరేణుక, లక్ష్మీభార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నందిగామ: వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్న ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్షతో ప్రయాణికుల జీవితాలను ఆటోవాలాలు పణంగా పెడుతున్నారని, పరిమితికి మించి ప్రయాణికులను.. ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే కూలీలను ఆటోల్లో కుక్కి మితి మీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని అన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలు కూడా ఈ విషయంలో ఆలోచించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే, తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు.



ఆటో చోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ హనీష్

ప్రారంభమైన సిలువగిరి తిరునాళ్లు

నందిగామ: పట్టణ శివారులో గల సిలువగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సువార్త స్వస్థత ప్రార్థనలు, సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ప్రతిష్ట మహోత్సవాలు

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

గౌతమబుద్ధ కేంద్రంలో ధ్యాన శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బుద్ధ విహార్‌లోని గౌతమ బుద్ధ ధ్యాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నెల 25వ తేదీ నుంచి మొదలైన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన కూరపాటి రఘు పాల్గొని శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రఘును ధ్యాన కేంద్రం ప్రతినిధులు పసుపులేటి సత్యశ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, మీసాల బాలాజీరావు, తొమ్మండురు నాగేశ్వరరావు, పరాంకుశం పద్మ తదితరులు ఘనంగా సన్మానించారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

కంచికచర్ల: భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నందిగామ ఆర్డీఓ పీ సాయిబాబు పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్ఓలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ఓటర్ల తుది జాబితా, ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను పకడ్బందీగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతుల కల్పన, భద్రతా సిబ్బందికి శిక్షణ, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, డేటాబేస్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుస్వాగతం, డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, బీఎల్ఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిబాబు



సమావేశానికి హాజరైన బూత్ లెవెల్ అధికారులు

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విద్యావేత్త నిడుమోలు రమాసత్యనారయణ అన్నారు. ఎస్ఎస్‌కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులకు జాతీయ స్థాయి గుర్తింపు ఉంటుందన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తునట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయనీ గాయకుల కృషిని అభినందించారు. సంస్థ అధ్యక్షుడు పైడిపాటి వెంకన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.



మాట్లాడుతున్న రమాసత్యనారయణ

ఇంటి హక్కులు.. జీవితాలకు వెలుగులు

- వేగవంతంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- కంచికచర్ల మండలంలో 3,556 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు
- 2,481 మందికి పూర్తయిన రిజిస్ట్రేషన్లు



కంచికచర్ల సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉద్యోగులు



కంచికచర్ల జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లు

కంచికచర్ల: నవరత్నాల పథకాలతో బడుగు, బలహీన వర్గాల్లో ఆర్థిక పరిస్థితిని ఒక మెట్టు పైకి ఎక్కించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఈ నాలుగేళ్ల పదినెలల కాలంలో పార్టీలకతీతంగా ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు కట్టించిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో వేగవంతంగా జరుగుతోంది. కంచికచర్ల మండలంలో ప్రభుత్వం సుమారు 117 ఎకరాలను కొనుగోలు చేసి 23 లే అవుట్‌లు వేసింది. మండలంలో 3,556 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పక్కా ఇళ్లు కట్టించారు. గతంలో ఉండే నిబంధనల ప్రకారం లబ్ధిదారులు కేవలం అనుభవించే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు బదలాయించి పక్కా రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొన్నేళ్ల తర్వాత ఆ స్థలంపై పూర్తి హక్కు లభిస్తుంది.

రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ ద్వారా కలిగే ప్రయోజనాలు..

- పదేళ్ల తర్వాత ఇంటి స్థలంపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఇప్పుడే ఉచితంగా స్థలాల రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ కూడా అందజేయడం జరుగుతుంది.
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్(జెఎస్ఆర్ఓ)డేటాబేస్‌లో వివరాలన్నీ పదిలంగా ఉంటాయి. ఎప్పుడైనా ఈ జెఎస్ఆర్ఓల్లో సర్టిఫైడ్ కాపీ పొందే అవకాశం ఉంటుంది. ఫోర్జరీ కానీ, ట్యాంపర్ చేయడానికి గానీ ఆస్కారమే ఉండదు.
- పదేళ్ల తర్వాత ఆటోమేటిక్‌గా క్రయ, విక్రయ దాన, వారసత్వ హక్కులతో సహా పూర్తి హక్కులు లబ్ధిదారులకు ఉంటాయి. అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకునే వీలు ఉంటుంది. అంతేకాకుండా స్థలం అమ్ముకునే సమయంలో ఎన్ఓసీ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.
- ఎలాంటి లింకు డాక్యుమెంట్లు అవసరం లేకుండానే నేరుగా రిజిస్ట్రేషన్ చేయబడుతుంది.

కంచికచర్లలో సెంటున్నర స్థలం రూ. 10 లక్షల పైనే..

కంచికచర్ల మండలంలోని గ్రామాల్లో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ఇచ్చి న సెంటున్నర(72.60 చదరపు గజాలు) ఇళ్ల స్థలం రూ. 10 లక్షల పైనే ఉంటుంది. చదరపు గజం రూ. 5,700 లు ఉంది. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ దస్తావేజుకు చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ రూ. 16,560, రిజిస్ట్రేషన్ రుసుం రూ. 2,070లు, యూజర్ చార్జీలు రూ. 500లు ఖర్చు అవుతుంది. అయితే స చివాలయాల్లో పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది.

వీఆర్వోలు, సెక్రటరీలతో రిజిస్ట్రేషన్‌లు..

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు ప్రభుత్వం తరుపున పూర్తి చేసి లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలన్న సీఎం జగన్ నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. భవిష్యత్‌లో కుటుంబ అవసరాల కోసం స్థలాన్ని తాకట్టు పెట్టాలన్నా, వారసులకు బదలాయించాలన్నా వేరొకరికి బదిలీ చేయించే హక్కు కూడా ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలుగుతుంది.

సీఎం జగన్‌ను ఎప్పటికీ మర్చిపోము



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలమైన మాకు ఇంటి స్థలం ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాం. ఆ ఇంటిలోనే ఉంటున్నాం. ఇప్పుడు ఆ స్థలానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సీఎం జగన్‌ను ఎప్పటికీ మర్చిపోము. మళ్లీ జగనన్న అధికారంలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా.

– సవరం లక్ష్మి, లబ్ధిదారు, గండేపల్లి

వేగవంతంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నాం..



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇచ్చిన స్థలాలను వేగవంతంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నాం. ఇప్పటి వరకు 70 శాతం పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి గ్రామ సచివాలయాల ద్వారా వీఆర్వోలు, సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చాం. ఆయా సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి.

– సుస్వాగతం తహసీల్దార్, కంచికచర్ల

రేపు లలితాదేవి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నరసింహారావుపాలెం(వీరులపాడు): లలితాదేవి పంచాయత ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామం అగస్త్య పీఠంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠంలో గురువారం ఉదయం 10.30 గంటలకు లలితాదేవి పంచాయత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, పసుపులేటి సాయిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేఎస్ వాస్ మృతి చిత్రకళారంగానికి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారుడు ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు కేఎస్ వాస్ (77)మృతి చిత్రకళారంగానికి తీరని లోటు అని ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎంవీ సాయిబాబు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో మంగళవారం ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన చిత్రకారుడు కేఎస్ వాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ వాస్ చిత్రకళ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. నగరంలో వందలాది మంది విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు నేర్పించి చిత్రకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.